ట్రాఫిక్ కష్టాలు డబుల్

- గోల్నాకలో వాహనదారుల ఇబ్బందులు తీరేదెప్పుడో?
- ఇరుకైన రోడ్లపై నిత్యం ప్రమాదాలు
- అంబర్‌పేట ఫ్లై ఓవర్, మూసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య జఠిలం



ఇరుకుగా ఉన్న గోల్నాక - అలీకేఫ్ చౌరస్తా

గోల్నాక, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గోల్నాక చర్చి నుంచి చే నెంబర్ నుంచి శ్రీరమణ చౌరస్తా ద్వారా అంబర్‌పేట ముఖ్రం హోటల్ వరకు నిర్మాణం చేస్తున్న అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణం ఏళ్ల నుంచి కొనసాగుతోంది. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం కారణంగా ట్రాఫిక్ మళ్లించారు. దీంతో గోల్నాకలో ట్రాఫిక్ సమస్య మొదలయింది. ఇరుకైన రోడ్లపై రోజూ వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు ప్రమాదాలూ జరుగుతున్నాయి. చిన్న రోడ్లలో వేల వాహనాలు వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు నరకం చూస్తున్నారు. దీనికి తోడు మూసారంబాగ్ వద్ద మూసీనదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు మొదలు పెట్టడంతో దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే రోడ్డు కూడా మూసి వేశారు. ఇక్కడి నుంచి వెళ్లే వాహనాలను మూసారంబాగ్ పెట్రోల్ బంప్ నుంచి గోల్నాక కొత్త బ్రిడ్జి ద్వారా రాకపోకలు కొనసాగిస్తుండడంతో గోల్నాక ట్రాఫిక్ పరిస్థితి దయనీయంగా మారింది. ఈ రెండు బ్రిడ్జీలు పూర్తయ్యే వరకూ గోల్నాక వాసులు ట్రాఫిక్ సమస్యలు భరించాలా.. అంటూ వాపోతున్నారు.

2018 మే 5వ తేదీన కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఫ్లై ఓవర్ నిర్మాణం పనులను ప్రారంభించి మూడున్నరేళ్లు అయినా ఇంకా పనులు పూర్తి కాలేదు. ఫ్లై ఓవర్ పనుల కారణంగా అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా నుంచి ట్రాఫిక్ మళ్లించి అలీకేఫ్ గుండా గోల్నాక ద్వారా వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో అంబర్‌పేట, గోల్నాకలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిపోయింది. ఇరుకైన రోడ్ల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కిక్కిరిసిన రద్దీ కారణంగా పాదాచారులు రోడ్డుపై నడవడం కూడా కష్టంగా మారింది. గోల్నాక చౌరస్తా నుంచి గోల్నాక కొత్తబ్రిడ్జిజిందాతిలిస్మాత్ రోడ్డు ద్వారా అలీకేఫ్ చౌరస్తాకు వెళ్లే రోడ్డులో సమస్యలు ఏర్పడుతున్నా ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. రోడ్డుకిరువైపులా టిఫిన్ సెంటర్లు, టీ-స్టాల్స్ వద్ద వాహనాలను నిలుపుతుండడంతో సమస్య మరింత జఠిలంగా మారుతోంది. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి కావడానికి ఎంతకాలం పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇరుకైన రోడ్లపై ట్రాఫిక్‌కు నియంత్రించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. గోల్నాక చౌరస్తా నుంచి అలీకేఫ్ వెళ్లే చౌరస్తా ఇరుకుగా ఉంది. ఆ ప్రాంతంలోనే బస్సులు, ఆటోలు ఆగడంతో పాటు కొంత మంది టీ, టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. అలాగే గోల్నాక చౌరస్తా నుంచి చాదర్‌ఘాట్‌కు వెళ్లే టర్నింగ్ కూడా ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫ్లై ఓవర్, బ్రిడ్జిల నిర్మాణం త్వరగా పూర్తి చేసి ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

మూసారంబాగ్ బ్రిడ్జి పూర్తయేదాకా ఇదే పరిస్థితి

మూసారంబాగ్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించడంతో గోల్నాక కొత్త బ్రిడ్జి ద్వారా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఇప్పటికే అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణంతో గోల్నాక నుంచే వాహనాల రాకపోకలు కొనసాగిస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు మూసారంబాగ్ బ్రిడ్జి పనులతో ఆ రోడ్డును కూడా బంద్ చేయడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపు య్యాయి.



ప్రమాదకరంగా ఉన్న గోల్నాక - చాదర్ ఘాట్‌కు వెళ్లే చౌరస్తా



మాట్లాడుతున్న పి.సాయిబాబా

ఈనెల 18న సేవా కార్యక్రమాలు

రాంనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలలో గల అన్ని డివిజన్లలో ఈనెల 18న ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించనున్నట్లు టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా తెలిపారు. బుధవారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో వర్ధంతికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. నగరంలోని అన్ని డివిజన్లలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీపతి సతీష్, జి.యాదగిరిరావు, నాగునగేష్, యాదగిరి పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తదితరులు

సేవాభావంతో పని చేస్తే సమాజంలో గుర్తింపు

బర్కత్‌పుర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సేవాభావంతో పని చేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. బుధవారం బర్కత్‌పురలో ఐ ఫోకస్ సంస్థ రూపొందించిన క్యాలెండర్‌ను బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. సంస్థ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్‌యాదవ్, నాయకులు మురళి, కిషోర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ ఏర్పాటు చేయాలి



ఎంపీ వివేక్ కె.టంకకు వినతిపత్రం అందజేస్తున్న సుధా నాగేందర్ తదితరులు

బర్కత్‌పుర, జనవరి10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ ఏర్పాటు చేయాలని దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరానికి వచ్చిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సుశీల్‌కుమార్ మోదీ, సభ్యులు ఎంపీ వివేక్ కె.టంకను కలిసి బుధవారం వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, లా కమిషన్ ఆఫ్ ఇండియా, దక్షిణాదిన సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదనలు పంపిందని ఆయన గుర్తు చేశారు. రీజినల్ బెంచ్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తే పేదలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. జేఏసీ నాయకులు సతీష్, రాజ్‌కుమార్, ఆకుల శంకరయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి, నరసింహయాదవ్ తదితరులు

సెంట్రింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

కవాడిగూడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సింగిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ ముఠా నర్సింహయాదవ్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. సింగిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ నర్సింహయాదవ్, అసోసియేషన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు పి.కృష్ణ, చైర్మన్ ఎస్.పరశురాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి చాంద్‌పాషా, కోశాధికారి సి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు కనకరాజ్‌గౌడ్, అహ్మద్, పాల్గుణరావు ఆవిష్కరించారు.



నాటక ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న ఆంధ్రమహిళాసభ కాలేజ్ ఫెస్ట్

నల్లకుంట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మహిళాసభ జూనియర్ కాలేజ్ ఫెస్ట్-24 కార్యక్రమం విద్యానగర్‌లోని కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఒకేషనల్ కోర్సు ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఫిజియోథెరపీ, కొత్త కోర్సులను కూడా 2024-25కి గానూ ప్రారంభించడంతో ఈ కోర్సులకు విద్యార్థినులు చక్కటి నాటకాన్ని ప్రదర్శించారు. విద్యార్థినులు ఈ కోర్సులకు సంబంధించిన అంశాలపై చక్కగా వివరిస్తూ ప్రదర్శన చేశారు. ఆంధ్రమహిళాసభ జూనియర్ కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ ఓ.భాగ్యలక్ష్మి, సెక్రటరీ జె.రమాదేవి, డాక్టర్ డి.ఉమ పాల్గొన్నారు.




అంజన్‌కుమార్‌యాదవ్‌కు మెమెంటో అందజేస్తున్న మహేష్, చరక నవీన్

అందరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలి

ముషీరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అందరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని జెమినికాలనీలో ముషీరాబాద్ అసెంబ్లీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరిస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌ను అసోసియేషన్ నాయకులు బంగారంతో తయారు చేసిన మెమెంటోను అందజేసి సన్మానించారు. బోస్‌మోన్ మహేష్, చైర్మన్ చరక నవీన్, కోశాధికారి అనిల్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ఆర్ కల్పనయాదవ్, అరవింద్‌కుమార్ యాదవ్, జనిగే శ్రీనివాస్ యాదవ్, నరేష్, మోహన్‌రాజ్, రవి పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన



సైన్స్ ఫెస్టివల్‌లో అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు

రాంనగర్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అంబేడ్కర్ విద్యాసంస్థల చైర్మన్ జి.వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఐఎస్ఆర్‌వో ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో నిర్వహించిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో బాగ్‌లింగంపల్లికి చెందిన అంబేడ్కర్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులకు బుధవారం కళాశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ వసుంధర, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విఠలాచారి, అడ్మిన్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో తొలిసారిగా 'కిమ్స్'లో స్మార్ట్‌వార్డు



ప్రారంభోత్సవంలో ఆస్పత్రి చైర్మన్, ఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, వైద్యులు

రాయదుర్గం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో స్మార్ట్‌వార్డు సిస్టంను డోజి టెక్నాలజీ కంపెనీ భాగస్వామ్యంతో అందుబాటులోకి తీసుకొచ్చామని డాక్టర్ సుధీర్ తెలిపారు. ఈ టెక్నాలజీ సహకారంతో రోగుల సంరక్షణ మరింత సులువవుతుందన్నారు. ఎన్‌హ్యాండ్స్ సేఫ్టీవింగ్ ప్రోగ్రామ్‌తో డోజీ టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కాంటాక్ట్‌లెస్ రిమోట్ పేషెంట్ మానిటరింగ్, ఎర్లీ వార్నింగ్ సిస్టమ్(ఈడబ్ల్యూఎస్) రోగి ఉన్న బెడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా రోగి పల్స్, హార్ట్‌బీట్, శ్వాస ఎప్పటికప్పుడు ఈ టెక్నాలజీ ద్వారా గుర్తించి డాక్టర్లు, నర్సులకు ఎప్పటికప్పుడు అందజేస్తాయన్నారు. దీంతో పేషెంట్ పర్యవేక్షణ. భద్రత, క్లినికల్ ఫలితాలు మెరుగుపడతాయన్నారు. కిమ్స్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు మాట్లాడుతూ.. చికిత్సకు ఈ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. డోజి సంస్థ సీఈవో, సహవ్యవస్థాపకులు ముదిత్ దండువాటే మాట్లాడారు.

'థియేటర్ల కార్మికులకు అదనపు వేతనం ఇప్పించాలి'

చిక్కడపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి పెద్దతారల సినిమాలు విడుదల అవుతున్న నేపథ్యంలో మల్టీప్లెక్స్, సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో పనిచేసే కార్మికులకు అదనపు వేతనాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జంటనగరాల కార్మిక సంయుక్త కమిషనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డికి తెలంగాణ సినిమా థియేటర్స్ కార్మికసంఘం నేతలు బుధవారం వినతిపత్రం సమర్పించారు. సంఘం అధ్యక్షుడు ఎన్ మారన్న, ఉపాధ్యక్షుడు పుల్లారావు, కార్యదర్శి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. సంక్రాంతి సందర్భంగా రోజుకు 5 నుంచి 6 షోలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఉదయం 5 గంటలనుంచి రాత్రి 12 వరకు 16 గంటలకు పనిచేయాల్సి ఉంటుందని, అందువల్ల అదనపు వేతనం ఇప్పించాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.



నూతన నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై కేసులు

చిక్కడపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నెంబర్ ప్లేట్లు లేని, ప్లేట్లు సరిగా లేని వాహనాలపై చిక్కడపల్లి పోలీసులు బుధవారం కేసులు నమోదు చేశారు. 10 వాహనదారులను స్టేషన్‌కు రప్పించి వారిపై కేసులు పెట్టారు. అప్పటికప్పుడు నూతన నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించుకుని వచ్చి ఫిట్ చేయించుకున్న వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సీతయ్య మాట్లాడుతూ.. నెంబర్ ప్లేట్లు సక్రమంగా లేకపోవడం, నెంబర్ ప్లేట్లు లేకపోవడం వంటి సంఘటనలు తరుచుగా జరుగుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేశామన్నారు. వాహనదారులు తమ వాహనాలకు నెంబర్‌ప్లేట్లు సక్రమంగా ఏర్పాటు చేయించుకోవాలని సూచించారు.

ముస్లిం శ్మశానవాటిక పనులు పూర్తి చేయాలి

అంబర్‌పేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ అలీకేఫ్ మూసీ పరివాహక ప్రాంతంలో ముస్లింల కోసం నిర్మిస్తున్న శ్మశానవాటిక పనులు వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన శ్మశానవాటిక నిర్మాణ పనులు పరిశీలించారు. సాధ్యమైనంత త్వరలో శ్మశానవాటిక అందుబాటులో తెచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్



పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

నల్లకుంట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో కోట్లాది రూపాయల వ్యయంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం తెలిపారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సీతకాలనీలో రూ.6 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీలకతీతంగా ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, జలమండలి మేనేజర్ మాజీద్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి

అంబర్‌పేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని ప్రభుత్వం పేదల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లో ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ వాహనాన్ని కిషన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా జన ఔషధి, కేంద్ర హెల్త్ మేళా, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, అటల్ పెన్షన్ యోజన, బీమా యోజన స్టాళ్లను జి.కిషన్‌రెడ్డి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, డాక్టర్ గౌతమ్‌రావు, దాసోజు నాగభూషణంచారి, భిక్షపతి, మైలారం రాజు, కృష్ణముదిరాజ్, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న జి.కిషన్‌రెడ్డి, కృష్ణాయాదవ్ తదితరులు

అయోధ్య రాముడి వెండి పాదుకలకు ప్రత్యేక పూజలు



పాదుకలు మోసుకొస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట/యాకుత్‌పురా, జనవరి10 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శృంగేరి పీఠం నుంచి శ్రీరామామృత తరంగిణి పేరిట 16 నదుల ఇసుక, పుణ్య తీర్థాలతో రాములోరికి సమర్పించే వెండి పాదుకలను లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదుకలకు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, ప్రచార కార్యదర్శి ఎ.వినోద్‌కుమార్, గడ్డం రవి స్వాగతం పలికారు. భక్తులు పాదుకలను దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ సి.రాజేందర్‌యాదవ్, మాజీ చైర్మన్లు కె.విష్ణుగౌడ్, సి.రాజ్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ జెమినికాలనీ పోచమ్మ ఆలయ కమిటీ రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ పూజారి, కమిటీ సభ్యులు తదితరులు

డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ హౌస్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. బుధవారం భోలక్‌పూర్ హౌస్ వద్ద కవాడిగూడ ముషీరాబాద్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గోపాల్, అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ముషీరాబాద్ నుంచి కవాడిగూడ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణలో వ్యాపారులకు నష్టం వాటిల్లకుండా పనులు చేపట్టే విధంగా అధికారులను ఆదేశిస్తామని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, కవాడిగూడ, ముషీరాబాద్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాకేష్ గుడినియా, ఉపాధ్యక్షుడు టి.సంజీవ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పీఎస్ రాజు, పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఆంజనేయులు, డాక్టర్ యాదగిరి, డాక్టర్ విజయ్‌మోహన్, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఆర్ శ్రీనివాస్, ఉమాకాంత్, కృష్ణ, యూత్ కమిటీ అధ్యక్షుడు సాయి పాల్గొన్నారు.

వచ్చేనెల 6, 7న యాదాద్రి నృత్యోత్సవ్



మంత్రి కృష్ణారావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎం.భారతి తదితరులు

నల్లకుంట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కళాకృతి నృత్యాలయ వ్యవస్థాపక ప్రిన్సిపాల్ ఎం.భారతి సారథ్యంలో యాదాద్రి నృత్యోత్సవ్ శీర్షికన జాతీయ నృత్యోత్సవం రవీంద్రభారతిలో ఫిబ్రవరి 6, 7వ తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ప్రముఖ నాట్యగురువు ఎం.భారతి, శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును సెక్రటేరియట్‌లో కలిసి నృత్యోత్సవ్ ఆహ్వానపత్రిక బుధవారం అందజేశారు. అనంతరం హైదర్‌గూడలో ఎం.భారతి, శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ.. పద్మశ్రీ సంగీత నాటక అకాడమీ అవార్డులు పొందిన సుప్రసిద్ధ నాట్య నిపుణులతో ఈ నృత్యోత్సవం నిర్వహిస్తున్నట్టు వివరించారు. న్యూఢిల్లీకి చెందిన ప్రతిభా ప్రహ్లాద్ భరతనాట్యం, గీతానారాయణ్ కూచిపూడి, ఒడిషాకు చెందిన మల్కామ్ ఫోక్ డ్యాన్స్ బృంద ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అలాగే కేరళకు చెందిన చిత్ర సకుమారన్ మోహినీయట్టం, న్యూఢిల్లీకి చెందిన అను, కాశ్‌మాలిక్ బృందం జానపద నృత్యం ఉంటుందన్నారు. న్యూఢిల్లీకి చెందిన భారత శివాజీ మోహినీయట్టం, తమిళనాడుకు చెందిన మాధవపెద్ది మూర్తి బృందం కూచిపూడి నాట్యం, ఒడిషాకు చెందిన సుజాతామహాపాత్ర వంటి ఉద్దండుల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఒక మహాక్రతువులా నిర్వహించే ఈ ఉత్సవానికి తప్పక హాజరవుతానని మంత్రి హామీ ఇచ్చారని వారన్నారు.

ఎక్సైజ్ శాఖలో అవినీతిపై విచారణ చేపట్టాలి

తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్



మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్

బర్కత్‌పుర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అక్రమ ప్రమోషన్లతో పాటు ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా కూర్చోబెట్టి జీతాలు ఇచ్చారని, దీనిపైనా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు చెందిన 636 మంది ఉద్యోగులు ఏపీలో పని చేస్తున్నారని, వారిని బదిలీ చేయాలని ఏపీ సీఎం ఆమోదించినా అప్పటి సీఎం కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. వారందరినీ బేషరతుగా తెలంగాణకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ శాఖలో గత ప్రభుత్వ హయాంలో డబ్బులెవరు ఇస్తే వారు కోరిన చోటుకు బదిలీ చేశారని ఆయన ఆరోపించారు. 49 మందికి ప్రమోషన్లు ఇచ్చి బదిలీ చేశారని, వీరిలో 12 మందికి పోస్టింగ్‌లు ఇచ్చి మిగతా 37 మందికి 10 నెలల పాటు కూర్చోబెట్టి వేతనాలు చెల్లించారని ఆరోపించారు. ఎంపీ సంతోష్‌కుమార్ అనుచరుడికి జూబ్లీహిల్స్‌లో టెండర్ లేకుండా వైన్‌షాపు కేటాయించారని, ఇందు కోసం ప్రత్యేక జీవో తెచ్చారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విచారణ జరిపిస్తే అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రసాద్, శివకుమార్, జగన్, వెంకట్‌గౌడ్, శేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నైనా జైస్వాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- చిన్న వయసులో పీహెచ్‌డీ చేయడం గర్వకారణం
- మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి



నైనా జైస్వాల్‌ను సత్కరిస్తున్న కె.గీతామూర్తి

బర్కత్‌పుర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నిస్ అంతర్జాతీయ క్రీడాకారిణి నైనాజైస్వాల్‌ను విద్యార్థులు క్రీడలు, విద్యలో స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి పిలుపునిచ్చారు. అతి చిన్న వయసులో పీహెచ్‌డీ పూర్తి చేయడం దేశానికే గర్వకారణమని ఆమె కొనియాడారు. క్రీడలు, చదువులో రాణిస్తున్న నైనా జైస్వాల్‌ను మహిళా మోర్చా నాయకురాలు వినీతసింగ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గీతామూర్తి మాట్లాడుతూ.. నైనాజైస్వాల్ టేబుల్ టెన్నిస్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించడంతో పాటు చిన్న వయసులో పీహెచ్‌డీ పూర్తి చేసి రికార్డు నెలకొల్పడం అభినందనీయమన్నారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో 'మైక్రో ఫైనాన్స్‌లో మహిళల పాత్ర' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందడం అభినందనీయమన్నారు. నైనాజైస్వాల్ మాట్లాడుతూ ఖేలో ఇండియా ద్వారా ప్రధాని మోదీ గ్రామీణ క్రీడాకారులను సమాజానికి పరిచయం చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా నైనాజైస్వాల్ తల్లి భాగ్యలక్ష్మిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకురాలు అనిత, హారతి తదితరులు పాల్గొన్నారు.